క్లుప్తంగా

17న జాబ్‌మేళా

టెక్కలి: ఈ నెల 17న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ అర్హతతో 18 నుంచి 35 ఏళ్ల నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ముత్తూట్ మైక్రోఫిన్, ఎస్‌బీఐ కార్డ్స్ టీమ్ లీజ్, అరబిందో తదితర సంస్థల్లో శ్రీకాకుళం, విశాఖ తదితర ప్రాంతాల్లో పని చేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో ఉదయం 9:30 గంటలకు కళాశాలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9182480410 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రక్తదానం.. మహాదానం

కవిటి: మండలంలోని ఆర్.బెలగాంలో ఎస్‌జీఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉద్దానం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 20 మంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఎస్‌జీఎఫ్ సీనియర్ సభ్యుడు ధూపాన సునీల్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈయన ఇప్పటి వరకు 37 సార్లు రక్తదానం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు.

శ్రీశయన విద్యార్థులకు పురస్కారాలు



ప్రోత్సాహకాలతో విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

సోంపేట: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీశయన చైతన్య దీపిక సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500 మార్కులు దాటిన శ్రీశయన విద్యార్థులకు శనివారం పురస్కారాలు అందజేశారు. సోంపేటలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస మండలాల్లోని 24 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3000 చొప్పున నగదు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా న్యాయమూర్తి చిరంజీవులు, సోంపేట ఉపఖజనా శాఖాధికారి కళ్యాణ చక్రవర్తి, దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు, బీన ఆనంద్, పొడుగు కామేష్, బల్ల జానకిరావు, దుద్ది శ్రీనివాసరావు, బల్ల బాబూరావు, తడక మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యానికి పెద్దపీట



బోరుబావికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు.కొత్త పుట్టుగ పెద్దవీధిలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.5 లక్షలతో ఏర్పాటు చేస్తున్న నూతన విద్యుత్ బోరుబావి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, యువ నాయకుడు నర్తు శివాజీ, నత్తు సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శత వసంతాల విజయోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

కవిటి: భారతీయుల ఆత్మగౌరవం, స్వాభిమానం ప్రకటనే లక్ష్యంగా ప్రారంభించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వందవ వసంతంలోకి ప్రవేశించడం అపురూప ఘట్టమని సంఘ ప్రతినిధి ధర్మరాజు అన్నారు. శనివారం సీహెచ్ కపాసుకుద్దిలో శతవసంతాల విజయోత్సవంలో భాగంగా స్వయంసేవకులు నినాదాలు చేస్తూ పథ సంచాలన్ (విజయోత్సవ ర్యాలీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925లో విజయదశమి శుభవేళ కొందరు విద్యావంతులతో కలిసి డాక్టర్ కేశవరావు బలీరాం హెడ్గెవార్ నేతృత్వంలో ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్ నేడు శాఖోపశాఖలుగా విస్తరించి దేశరక్షణలో అసమాన సేవలు అందిస్తుండటం స్ఫూర్తిదాయకమన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామానికి వెళ్లే రోడ్డులో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మకరాంపురం గ్రామానికి చెందిన వజ్జ త్యాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. త్యాగరాజు భార్యతో కలిసి జాడుపూడిలోని కాళికాదేవి ఆలయం వద్ద జరిగిన అన్నప్రసాద కార్యక్రమానికి హాజరై తిరిగి బైక్‌పై వస్తుండగా టింబర్ డిపో సీమపంలో వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో త్యాగరాజు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని 108 అంబులెన్స్‌లో సోంపేట సీహెచ్‌సీకి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 మద్యం షాపులకు 245 దరఖాస్తులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, ఇచ్ఛాపురం మండలం, కవిటి మండలం పరిధిలో ఎనిమిది ప్రైవేటు మద్యం దుకాణాలకు 245 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పి.డి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు బండి.. అంతా పక్షపాతమండి!

- అభివృద్ధికి నోచుకోని సోంపేట, జాడుపూడి, బారువ రైల్వేస్టేషన్లు
- అనాదిగా కొనసాగుతున్న పక్షపాత వైఖరి
- అదనపు హాల్టులు లేక ప్రయాణికుల అసంతృప్తి



సోంపేట రైల్వేస్టేషన్



సోంపేటలో రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆగిన రైలు

కంచిలి: జిల్లా శివారులోని ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ పరిధిలోని స్టేషన్ల ద్వారా ప్రయాణికులు, పార్సిళ్లు, ఎం.ఎస్.టి.ల పరంగా మంచి ఆదాయం వస్తున్నా సౌకర్యాల కల్పనలో మాత్రం రైల్వేశాఖ పక్షపాత వైఖరి అవలంబిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సోంపేట, జాడుపూడి, బారువ రైల్వేస్టేషన్లలో కనీస వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇక్కడికి వెళ్లాల్సిన ప్రయాణికులు ఇటు బరంపురం, అటు పలాస వంటి స్టేషన్లకు పయనమై అక్కడి నుంచి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. సోంపేట స్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు కల్పించినా.., జాడుపూడి, బారువ స్టేషన్లు మాత్రం ప్యాసింజర్ రైళ్లకే పరిమితమవుతున్నాయి. కనీసం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కైనా హాల్టు ఇవ్వాలని స్థానికులు ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా రైల్వే ఉన్నతాధికారులు పట్టించుకోవటం లేదు.

పట్టించుకోని రైల్వే శాఖ..

సోంపేట స్టేషన్లో ఫలక్‌నుమా, యశ్వంత్‌పూర్ తదితర సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టు కల్పించమని ఎంతో కాలంగా కోరుతున్నా రైల్వేశాఖ పట్టించుకోవటంలేదు. ఈ స్టేషన్‌పై కంచిలి, సోంపేట, కవిటి మండలాలతోపాటు సమీప ఒడిశా గ్రామాల ప్రయాణికులు ఆధారపడుతున్నారు.

ఇక్కడి ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ఎటువంటి రైళ్ల నిలుపుదల చేయడం లేదు. కనీసం ప్యాసింజర్ రైళ్లు కూడా ఆగడం లేదు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు అతికష్టంపై బ్రిడ్జి ఎక్కి రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు చేరుకుంటున్నారు.

కాని డిస్‌ప్లే బోర్డులు..

సోంపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లపై కోచ్, పొజిషన్ డిస్‌ప్లే బోర్డులు లేవు. ఏడాదిన్నర కాలం క్రితం వీటిని మంజూరు చేసినా ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రయాణికులు ఏ బోగీ ఎక్కడ ఉందో తెలియక అయోమయం చెందుతున్నారు. జాడుపూడి, బారువ స్టేషన్లలో టాయిలెట్లు, నీటి సౌకర్యం వంటివి సక్రమంగా లేవు. జాడుపూడి స్టేషన్ ఉద్దానం ప్రాంతానికి సమీపంలో ఉండటంతో కొబ్బరికాయలు, ఇతర సామగ్రిని ఒడిశా తదితర ప్రాంతాలకు రవాణా చేయటానికి అనువుగా ఉంటుంది. ఇక్కడ ప్యాసింజర్ రైళ్లతోపాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. బారువ స్టేషన్ తీరప్రాంత ప్రయాణికులు అవసరాల కోసం ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ కూడా మౌలిక సౌకర్యాల లేమి వేధిస్తోంది. ఇప్పటికైనా ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు తమ మొర ఆలకించాలని స్థానిక ప్రయాణికులు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి..

జిల్లాకు శివారులో ఉన్న సోంపేట, బారువ, జాడుపూడి రైల్వేస్టేషన్లను ప్రయాణికుల అవసరాలకు తగినట్లు అభివృద్ధి చేయాలి. సోంపేట స్టేషన్లో మరిన్ని సూపర్‌ఫాస్ట్‌లకు హాల్టు కల్పించాలి. జాడుపూడి, బారువ స్టేషన్లలో బరంపురం-విశాఖపట్నం-బరంపురం ప్యాసింజర్ రైలుకు హాల్టు కల్పించాలి.

– బీన ఢిల్లీరావు, సోంపేట రైల్వేస్టేషన్ ప్రయాణికుల పోరాట కమిటీ ప్రతినిధి

డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలి..

సోంపేట స్టేషన్‌లో కోచ్ డిస్‌ప్లే బోర్డులు త్వరితగతిన ఏర్పాటు చేయాలి. ఏడాదిన్నర క్రితం మంజూరైనా ఇంతవరకు ఆ పనులు ఇక్కడ ప్రారంభించకపోవడం దారుణం. దీని వల్ల ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– ఎల్.కె.పండా, ప్రయాణికుడు, కంచిలి

క్విజ్ పోటీల విజేత ఇచ్ఛాపురం



బహుమతులు అందిస్తున్న రాజశేఖరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచిలో శారదామాత 40వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో ఇచ్ఛాపురం జట్టు విజేతగా నిలవగా, తేలుకుంచి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, ఎంపీటీసీ ప్రతినిధి మేరుగు సూర్యనారాయణరెడ్డిలు బహుమతులు అందజేశారు.

స్తంభించిన ట్రాఫిక్



కాశీబుగ్గ మూడు రోడ్లు కూడలిలో నిలిచిన వాహనాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మూడు రోడ్లు కూడలి వద్ద ఆదివారం ట్రాఫిక్ స్తంభించింది. రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనచోదకులు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగించడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. దసరా వేడుకలు ముగియడంతో ఒక్కసారిగా సొంత ఊళ్లకు వెళ్లే వారు పట్టణాలకు చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ సంబరం



ముత్యాలమ్మను ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేశపురంలో గ్రామదేవత ముత్యాలమ్మ సంబరం ఆదివారం అంబరాన్ని తాకింది. అమ్మవారిని ప్రత్యేక జంగిడిలో ఉంచి మేళతాళాల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన దసరా వేడుకలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల వ్యాప్తంగా విజయ దశమి వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహన, ఆయుధ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దసర సందర్భంగా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అమ్మవారి విగ్రహాలను దర్శించుకుంటున్న భక్తులు



టెక్కలి: టెక్కలి గ్రామదేవత కిల్లిపోలమ్మ ఆలయంలో పూజలు



వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లిలో ఊరేగుతున్న దుర్గాదేవి



రాపాక పుట్టుకలో భక్తుల శోభాయాత్ర



ఇచ్ఛాపురం: నిప్పుల గుండం వద్ద పూజలు చేస్తున్న గాయత్రీదేవీ ఉపాసకులు వాసుదేవరెడ్డి



ఇచ్ఛాపురం: జగన్నాథ ఆలయ ఆవరణలో జమ్మిచెట్టుకు పూజలు



సోంపేట:రాజరాజేశ్వరిదేవిగా సోంపేట సోమపోలమాంబ



కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి సన్నిధిలో ఉచిత ప్రసాద పంపిణీ

కమనీయం.. మహా సామ్రాజ్య పట్టాభిషేకం



పట్టాభిషేక ఉత్సవంలో సీతారామలక్ష్మణులు

కవిటి: స్థానిక పట్టాభిరామ ఆలయంలో శనివారం రాత్రి శ్రీరామచంద్రుల మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా సాగింది. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు శ్రీకాకుళంకు చెందిన పండితులు రామానుజాచార్యులు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు ఆధ్యాత్మిక రామాయణ పారాయణాన్ని వైభవంగా నిర్వహించారు. పదో రోజున ఉత్సవ ముగింపులో భాగంగా పట్టాభిరామాలయ అనువంశిక ప్రధాన అర్చకులు కందాల పద్మనాభ యోగానంద స్వామి ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్తలు బెందాళం కామరాజు, నారాయణ మూర్తి సోదరుల ఆధ్వర్యంలో శ్రీరామచంద్రుని మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

20న వ్యవసాయ సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతాంగ సాధన కమిటీ సభ్యులు

కాశీబుగ్గ: ఈ నెల 20న బాలిగాం జంక్షన్‌లోని నరేష్ ఫంక్షన్ హాలులో జరిగే వ్యవసాయ సదస్సును విజయవంతం చేయాలని రైతాంగ సాధన కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మందస మండలం హరిపురంలో మార్పు ట్రస్ట్ భవనం ఆవరణలో కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు, నల్ల హడ్డి, గొర్లె చలపతిరావు, దాసరి శ్రీరాములు, డి.వీరాస్వామి, రాపాక చిన్నారావు, కోరాడ లింగమూర్తి, ముకుందరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విజేతలు

కాశీబుగ్గ: జిల్లా స్థాయి సత్యసాయి యూనిట్ ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. ఫైనల్ పోరులో కాశీబుగ్గకు చెందిన కళ్యాణ్ జట్టు విన్నర్‌గా, పలాసకు చెందిన ధనుంజయ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు ట్రోఫీలు అందజేసి అభినందించారు. జిల్లా సాధన శిబిరం ఇన్‌చార్జి జామి చిరంజీవి శ్రీనివాస్, జోనల్ కన్వీనర్ భైరాగి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలాస సత్యసాయి ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరం, శరత్, జగ్గప్ప, నారాయణ, ఢిల్లీ, కొంతేయుడు, శ్రీనివాస్, కామేశ్వరావు, కృష్ణ పాల్గొన్నారు.

కిటకిటలాడిన మాంసం దుకాణాలు



మాంసం దుకాణం వద్ద రద్దీ

ఇచ్ఛాపురం రూరల్: విజయదశమి శనివారం కావడంతో మాంసం ప్రియులు ఆ రోజంతా నాన్‌వెజ్‌కు దూరంగా ఉన్నారు. మరుసటి రోజు ఆదివారం కావడంతో వేకువజాము నుంచే మాంసం దుకాణాల ముందు బారులు తీరారు. ధరలు పెరిగినా పండగ కావడంతో కొనక తప్పలేదు.

బాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు



బాబా సేవలో దువ్వాడ శ్రీకాంత్, శ్రీధర్

కాశీబుగ్గ :

పలాస శివాజీనగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరంలో ఆలయ ధర్మకర్త దువ్వాడ శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం సాయిబాబా మహారాజ్ మహాసమాధి ఘనంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన మహాన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో దువ్వాడ శ్రీకాంత్, రుంకు శంకరరావు, దువ్వాడ అన్నాజీ, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ:

మానవ మనుగడకు మూలాధారమైన మొక్కలను ప్రతిఒక్కరూ నాటి సంరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. పలాస మండలం కొత్తూరులో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పైల తిరుమలరావు, హారతి నేతృత్వంలో 110 మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండుదొర, కార్యదర్శి తమ్మినాన మాధవరావు, ట్రెజరర్ నెమలిపురి అప్పారావు, డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, బాడ కోదండరావు, పేరాడ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 16న ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.